క్లుప్తంగా

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద ప్రజలకు వరంలాంటిదని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కోడుమూరులో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డా.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. వైద్యులు ఇళ్ల వద్దకే వెళ్లి వారికి వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ వైద్యులు సబీహా నస్రీన్, సీహెచ్ఓ శాంత తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు (టౌన్): విజయవాడలో అధికారిక, వ్యక్తిగ పనుల దృష్ట్యా నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు సెలవు పెట్టారు. అయితే రెండవ శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో కమిషనర్ నాలుగు రోజులు అందుబాటులో ఉండారు. తిరిగి సోమవారం అందుబాటులోకి వస్తారని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. పాలన పరంగా ఇబ్బందులు లేకుండా నాలుగు రోజుల పాటు నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్ వ్యవహరిస్తారని తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఓర్వకల్లు: ఉపాధి కూలీలకు 11 వారాల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.30 వేల కోట్లు తగ్గించి ఇవ్వడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించి, ప్రతి ఒక్కరికీ 200 రోజుల పనిదినాలతో పాటు, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

గూడూరు రూరల్: గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మాధవీలత పేర్కొన్నారు. పెంచికలపాడులో జరుగుతున్న సచివాలయం పనులను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. అయితే, నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా సచివాలయ సిబ్బంది తనిఖీలు నిర్వహించాలన్నారు. కాంట్రాక్టర్లు ఆయా భవన నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు.


పాఠశాల తనిఖీ

గూడూరు: పట్టణంలోని జెడ్పీ బాలికలు, పడమర బీసీ కాలనీ డిపెప్ పాఠశాలలను బుధవారం ఎంఈఓ సునీలమ్మ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు హాజరు పట్టీ, రికార్డులు పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో మాట్లాడి బోధన గురించి తెలుసుకున్నారు. జెడ్పీ బాలికల పాఠశాలలో స్టడీ అవర్ ను పరిశీలించి , బాగా చదువుకోవాలని 10 వ తరగతి విద్యార్థులకు సూచించారు.

అలసత్వం వీడండి

గూడూరు: ఇంటి, ఆస్తి, నల్లా తదితర పన్నుల వసూళ్లలో సిబ్బంది అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పన్నుల వసూళ్లపై సమీక్షించారు. అలాగే భవన నిర్మాణ పన్నులపై ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని కమిషనర్ ఆదేశించారు. మున్సిపల్ ఏఈ నరసింహులు, మేనేజర్ రవికుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు



అవగాహన ర్యాలీలో ఎస్ఐ సోమ్లానాయక్

గూడూరు రూరల్: డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఆరోగ్య జీవితాన్ని గడపాలని ఎస్ఐ సోమ్లానాయక్ ప్రజలను కోరారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కె.నాగలాపురం పోలీసుస్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడితే మరణానికి దగ్గరవుతారన్నారు. అందుకే ప్రభుత్వం డ్రగ్స్ వినియోగం, అమ్మకాల కట్టడికి చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వినియోగిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు. డ్రగ్స్‌ను వినియోగిస్తూ పట్టుబడితే 6 నెలల లేదా ఏడాది పాటు, విక్రయిస్తే 10 నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష తప్పదన్నారు.

నగరాభివృద్ధికి పెద్దపీట

- రూ.117 కోట్లతో శరవేగంగా వివిధ రకాల ప్రగతి పనులు
- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- కల్లూరు అర్బన్ వార్డుల్లో రూ. 1.16 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఆధునికీకరించిన 4 పార్కులు పునఃప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవైరామయ్య

కల్లూరు: కర్నూలు నగరాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 29, 31,33, 36వ వార్డుల్లో రూ. 1.16 కోట్ల నగర పాలక సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు వారు శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆధునికీకరించిన నాలుగు పార్కులను పునఃప్రారంభించారు. 29వ వార్డు వివేక్‌నగర్ పార్కును రూ. 6 లక్షలతో, కస్తురినగర్ పార్కును రూ. 8 లక్షలతో, 31వ వార్డు సాయినగర్ పార్కును రూ. 9.70 లక్షలతో, 37వ వార్డు ఆదిత్య నగర్ పార్కును 9.60 అభివృద్ధి చేశారు. అలాగే 36వ వార్డులోని డ్రైవర్స్ కాలనీలో రూ. 33 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు , రాజీవ్ గృహకల్ప కాలనీలో రూ. 50 లక్షలతో అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మేయర్ రామయ్య మాట్లాడుతూ... మాట్లాడుతూ నగరంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలక వర్గం వచ్చాక నగరంలో రూ. 117 కోట్లతో 757 రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో ఇప్పటికే 388 పనులు దిగ్విజయంగా పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు వివిధ దశల్లో సాగుతున్నాయన్నారు. అందరి సహకారంతో ప్రణాళికాయుతంగా నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ...కల్లూరు అర్బన్ పరిధిలో రూ.55 కోట్లతో అనేక రకాల పనులు చేపట్టామన్నారు. అత్యవసర పనులకు తొలిప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మళ్లీ ఓటమి తప్పదనే భయంతో ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు ఎంఈ షాకీర్, డీఈఈ రాజశేఖర్, ఏఈ కృష్ణలత, ఉద్యానశాఖ ఏడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



వృద్ధురాలి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధి 35వ వార్డు పరిధిలోని భగవాన్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీలో వృద్ధులు, మహిళలు, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే తాము గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. కాలనీకి చెందిన మహిళలు పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య, పలువురు కార్పొరేటర్లు, ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, వార్డులోని స్థానిక నాయకులు ఎం.సుధాకర్‌రెడ్డి, సుభాన్, శివారెడ్డి, షకీల్, వలి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను సద్వినియోగం చేసుకోండి



బ్రాహ్మణదొడ్డిలో భూముల రీ సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం కింద చేపడుతున్న భూసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను ఆయన తనిఖీ చేశారు. బ్రాహ్మణదొడ్డి గ్రామంలో రెవెన్యూ అధికారులు జాకీర్, గ్రామ సర్వే సహాయకుడు రాజశేఖర్‌కు సర్వేపై పలు సూచనలు చేసి భూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవన్నారు. మండలంలో ప్రస్తుతం 80 శాతం భూముల రీ సర్వే పూర్తయిందని చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ

కర్నూలు (టౌన్): స్వచ్ఛతలో ఇప్పటికే రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిన నగరపాలక సంస్థను మరింత ముందు వరుసలో నిలిపేందుకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడంతో పాటు వంద శాతం తడి, పొడి చెత్త సేకరించడం, మరింత పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ప్రతి డివిజన్‌కు ప్రత్యేక అధికారిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1, 2 డివిజన్లకు సుహేయిల్ 2,4 డివిజన్లకు జునీద్ 4, 7వ డివిజన్లకు రాజు, 3, 11 డివిజన్లకు అబ్దుల్ రసూల్, 10, 11, 8,12 డివిజన్లకు ఇస్మాయిల్, 12,13 డివిజన్లకు క్రిష్టఫర్, 13, 14, 15 డివిజన్లకు అబ్దుల్ వాజిద్, 16,17 డివిజన్లకు మన్సూర్ బాష, 8,16,17 డివిజన్లకు సాధిక్ హుస్సేన్, 8,6,5,9 డివిజన్లకు మన్సూర్ బాష, 1,9 డివిజన్లకు ఖలీల్ రహిమాన్‌లను నియమించారు.

సచివాలయాల సేవలను విస్తరించండి



ఈర్లదిన్నెలో ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

సి.బెళగల్: సచివాలయ సేవలను మరింత విస్తరించాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తకోట – 1 గ్రామ సచివాలయంలో కార్యాలయ నిర్వహణ తీరును, ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ సందీప్‌ను ఆదేశించారు. అనంతరం కొత్తకోట – 2 (ఈర్లదిన్నె), ముడుమాల సచివాలయాలను తనిఖీ చేసి, మీ పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్లక్ష్యం వీడాలని ఉద్యోగులకు హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కర్నూలు సిటీ: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్ అన్నారు. బుధవారం నగర శివారులోని శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్(కట్టమంచి స్కూల్)లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

దాడి కేసు నమోదు

కల్లూరు: అక్రమంగా ఇసుక రవాణాను అడుకున్నందుకు బుధవారం జేపీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ విజిలెన్స్ టీమ్ హెడ్ సూర్య చరణ్ కుమార్‌పై లక్ష్మీపురానికి చెందిన కొందరు దాడి చేసి గాయపరిచారు. మా గ్రామానికి వచ్చి మమ్మల్నే అడుకుంటావా అని ఆయనను బెదిరించారు. ఈ మేరకు బాధితుడు సూర్య చరణ్ కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకుండ ఎస్ఐ నల్లప్ప తెలిపారు.

రేపు వేలం పాటలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామం శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ అంగళ్ల నిర్వహణకు ఈ నెల 10 వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణుడు బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. టెంకాయల, గాజులు, పటాలు, పూల అంగళ్ల నిర్వహణకు ఆసక్తి గల వారు రూ.10 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

వాహనాల వేలం

పాణ్యం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పాణ్యం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.2.24 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, బీటీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటకు అందలం

- జిల్లాలో క్రీడాభివృద్ధికి 'శాప్' ప్రత్యేక చొరవ
- నిధుల మంజూరుతోపాటు పరిపాలన అనుమతులు జారీ
- కర్నూలులో బాస్కెట్‌బాల్, మూడు సింథటిక్ టెన్నిస్ కోర్టుల నిర్మాణం
- నంద్యాలలో నాలుగు సింథటిక్, రెండు మట్టి కోర్టులు
- నందికొట్కూర్, పగిడ్యాల, ఆళ్లగడ్డలో ఇండోర్ స్టేడియాల ఏర్పాటు



నందికొట్కూరులో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల దృశ్యం

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత క్రీడలకు మంచి రోజులు వచ్చాయి. గతంలో నామమాత్రంగా ఉన్న శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ప్రస్తుతం కీలకంగా వ్యవహరిస్తోంది. నూతన క్రీడా పాలసీ అమలులోకి వచ్చిన తరువాత జిల్లాలో పెద్ద సంఖ్యలో క్రీడల నిర్వహణ జరుగుతోంది. ఆటలతోకు అగ్ర పాధాన్యత ఇస్తూనే క్రీడాకారులకు పూర్తి సహాయ, సహకారం అందిస్తోంది. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు, స్పోర్ట్స్ క్లబ్స్, ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా సంబరాలు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా అనేక నియోజకవర్గ కేంద్రాల్లో స్టేడియాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చొరవతో కర్నూలు ఉమ్మడి జిల్లాలో క్రీడలకు సంబంధించిన అభివృద్ధి పనులు, యువత, విద్యార్థులు క్రీడల వైపు దృష్టి సారించేలా ఎన్నో చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం శాప్ బోర్డు మీటింగ్‌లో జిల్లాలో క్రీడల అభివృద్ధికి సంబంధించి నిధుల మంజూరు చేయడం తోపాటు పరిపాలన అనుమతులు జారీ చేశారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ఆధునీకీకరణ:

జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టు చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. సిమెంటు దెబ్బతినడంతో క్రీడాకారులకు చిన్నపాటి గాయాలు అవుతున్నాయి. దీన్ని ఆధునీకరించాలని గతంలో ఎన్నో విన్నపాలు వచ్చాయి. అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం బాస్కెట్ బాల్ కోర్టును జాతీయ స్థాయి ప్రమాణాలతో రూ.61 లక్షలు వెచ్చించి పూర్తిగా సింథటిక్ కోర్టుగా మారుస్తోంది. ఇందుకు నిధులు మంజూరు అయ్యాయి. ఇక టెన్నిస్‌కు మంచి ఆదరణ ఉండటం, ఇక్కడ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు ఉన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని వెంకటరమణ కాలనీలో రూ.1.20 కోట్లతో 3 సింథటిక్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.6.69 కోట్లతో స్టేడియాల నిర్మాణాలు

కర్నూలు నగరంతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇండోర్ స్టేడియాల నిర్మాణాలు చేపట్టేందుకు శాప్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు నిధులు మంజూరు చేసింది. దీంతో నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 4 సింథటిక్ కోర్టులు, 2 మట్టి టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రూ.2 కోట్లు మంజూరు చేశారు. అలాగే నందికొట్కూర్, పగిడ్యాలలో ఒక్కోదానికి రూ.1.20 కోట్ల చొప్పున 2 ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తున్నారు. పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వచ్చే నెల మార్చి నెలాఖరులోపు ఈ పనులు పూర్తి కావచ్చని స్పోర్ట్స్ అధికారులు తెలిపారు. నందికొట్కూర్ పట్టణంలో రూ.10 లక్షలు వెచ్చించి ఫ్లడ్‌లైట్ల సౌకర్యాలతో వాలీబాల్ కోర్టు నిర్మించనున్నారు. అలాగే ఆళ్లగడ్డ పట్టణంలో రూ.1.20 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నారు. కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డ ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, శిల్పా రవి చంద్రారెడ్డి, గంగుల బిజేంద్రరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో పాటు స్థానికంగా క్రీడా సంఘాలు కోరడంతో శాప్ ప్రత్యేకంగా దృష్టి సారించి వీటన్నింటికీ నిధులు కేటాయించడమే కాకుండా అధికారికంగా పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

త్వరలో పనులు ప్రారంభం



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడలకు, క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో ఇండోర్ స్టేడియాల నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని అనుమతులు ఇచ్చింది. ఇది క్రీడాకారులకు ఎంతో ఊరట ఇస్తుంది. క్రీడారంగంలో జిల్లా మరింత ముందు స్థానంలో నిలబడేందుకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాకు వచ్చిన శాప్ నిధులతో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా టెండర్లు నిర్వహించి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తాం.

– రమణ, సీఈఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ

విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలి

గూడూరు రూరల్: విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ సూచించారు. పెంచికలపాడు హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల ఇంటికి బుధవారం వెళ్లి వారి చదువు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు బయటకు వెళ్లకుండా చదువుకునేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఆయన వెంట స్కూల్ కమిటీ చైర్మన్ సుంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని మీదివేముల గ్రామంలో ఇళ్ల పురోగతిపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆయన స్థానిక జగనన్న హౌసింగ్ కాలనీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. అయితే, కొందరు ఇంకా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదన్నారు. మొత్తం 67 మందిలో 55 మంది నిర్మాణాలు మొదలు పెట్టినట్లు తెలిపారు. మిగతా వారు కూడా త్వరలో మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామయ్య, మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా రహదారులు

- నాణ్యతా ప్రమాణాలతో పనులు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- సుంకేసుల రోడ్డు పనుల తనిఖీ



సుంకేసుల వద్ద రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గంలో రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వేసవిలోపు పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుధాకర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కర్నూలు మండలం సుంకేసుల నుంచి తిమ్మందొడ్డి వరకు రూ.11 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. శిథిలమైన రోడ్లను పూర్తిస్థాయిలు బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలు రోడ్ల పనులకు అవసరమైన నిధులు కూడా విడుదల చేసిందని చెప్పారు. నాబార్డు నిధులతో కోడుమూరు -గూడూరు రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. వేసవికాలం పూర్తయ్యేలోపు సుంకేసు నుంచి తిమ్మందొడ్డి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు మండల జెడ్పీటీసీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి

ఆర్ కొంతలపాడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ. 1.60 కోట్ల నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంపై ఎమ్మెల్యే సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఆ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పనులు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ హెచ్ఎం కృష్ణవేణిపై చర్యలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. ఆ తర్వాత గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ ఈఈ కర్రెన్న, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురూరులో దేవుళ్ల కొలువుదీరడం శుభపరిణామం

కర్నూలు మండల పరిధిలోని ఎదురూరు గ్రామంలో సీతారాములు, శివయ్య విగ్రహాలు ప్రతిష్ఠించడం శుభపరిణామమని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. బుధవారం ఆ గ్రామంలో సీతారాములు, శివయ్య దేవాలయాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే తనిఖీ చేసి పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానికులు తనను కలిసి దేవాలయం నిర్మించాలని కోరారన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు

నేడు కొత్తకోటలో గడపగడపకు..

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గామ సచివాలయ పరిధిలోని గురువారం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8:30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

చేసిన మేలును ప్రజలకు వివరించాలి

- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే సుధాకర్ పిలుపు

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వల్ల కలుగుతున్న మేలును ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులపై ఉందని కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కోడుమూరులోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై, ఎమ్మెల్యేలపై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వానికి, జగనన్న పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించాలన్నారు. మరోసారి జగనన్నను గెలిపించుకుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, నేతలు రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, ముల్లా సలీం, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అయ్యప్ప, మధు, గిడ్డయ్య పాల్గొన్నారు.



కోడుమూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్